సాక్షి విశాఖపట్నం
ఆదివారం । 20 । జూలై । 2025



అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం 8లో



రోడ్డెక్కిన జీవీఎంసీ ఇంజనీరింగ్ కార్మికులు 8లో



రాష్ట్ర వ్యాప్తంగా 'ఎన్టీఆర్ ట్రస్ట్ తలసేమియా సెంటర్లు' 8లో

న్యూస్‌రీల్

ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుదాం

కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

కొమ్మాది: నగరంలో ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలికే విధంగా ప్రజలు బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. 8వ వార్డు ఎండాడలోని ఆర్ఆర్ఆర్ సెంటర్‌లో జరిగిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నగరం నుంచి ప్లాస్టిక్ వస్తువులను పారద్రోలాలన్నారు. పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ కృషి చేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా పూపర్, నార సంచులు, వస్త్ర సంచులు, స్టీల్, గ్లాస్, పింగాణీ గిన్నెలు, కప్పులు, డబ్బాలు, వాటర్ బాటిళ్లు వంటి పర్యావరణహితమైన వస్తువులు వినియోగించాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ వినయోగం నియంత్రణపై ప్రతిజ్ఞ చేశారు. లెట్స్ ఎండ్ ప్లాస్టిక్ పొల్యూషన్ టు గెదర్ అనే సమాచారంతో కూడిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. యోగా డే, గిరిప్రదక్షిణ రోజు విధి నిర్వహణలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులను సత్కరించారు.

సౌత్ ఏసీపీగా శ్రీనివాసరావు

క్రైమ్ ఏసీపీగా ధర్మేంద్ర

విశాఖ సిటీ: విశాఖ సౌత్ ఏసీపీగా వై.శ్రీనివాసరావు నియమితులయ్యారు. కొద్ది రోజుల క్రితం ఇక్కడ సౌత్ ఏసీపీగా పనిచేసిన త్రినాథ్‌ను డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. ఆయన స్థానంలో సీఐడీ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరావును నియమించారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పోస్టింగ్ కోసం వేచి ఉన్న కె.ధర్మేంద్రకు విశాఖ క్రైమ్ ఏసీపీగా పోస్టింగ్ ఇచ్చారు. ఆ స్థానంలో ఉన్న డి.లక్ష్మణరావును టెక్కలి డీఎస్పీగా బదిలీ చేశారు. అదే విధంగా ఎర్ర చందనం యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా ఉన్న జి.బాలిరెడ్డికి విశాఖలో నార్త్ కోస్టల్ సెక్యూరిటీ డీఎస్పీగా నియమించారు.

మత్తు కలిగించే మందుల స్వాధీనం

విశాఖ సిటీ: విచ్చల విడిగా మత్తు కలిగించే మందులు విక్రయించే మరో మెడికల్ షాప్ వ్యవహారం బట్టబయలైంది. ఔషధ నియంత్రణ శాఖ, టాస్క్‌ఫోర్స్ పోలీసుల సంయుక్త తనిఖీల్లో మరో వ్యాపారి దొరికారు. మందుల చీటి లేకుండా మత్తు కలిగించే మందులు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం జగదాంబ జంక్షన్ వద్ద ఉన్న శ్రీ అయ్యప్ప మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌పై నిఘా పెట్టారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు ఇస్తున్న సమయంలో పట్టుకున్నారు. షాపులో తనిఖీ చేయగా ఫార్మాసిస్ట్ లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వారి నుంచి మొత్తం 470 మత్తు కలిగించే రెండు రకాల ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. షాపు లైసెన్సును హోల్డ్ చేయడంతో పాటు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.


ఒకటో తేదీ నుంచి ఏపీఎల్ ఆటగాళ్ల నెట్ ప్రాక్టీస్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో పాల్గొనే జట్ల ఆటగాళ్ల నెట్ ప్రాక్టీస్ ఆగస్టు ఒకటో తేదీ నుంచి వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ప్రారంభం కానుంది. ప్రస్తుత సీజన్‌లో మరో జట్టు(మొత్తంగా ఏడు జట్లు) అదనంగా కలవడంతో 135 మంది ఆటగాళ్లను ఫ్రాంచైజీలు ఎంపిక చేసుకున్నాయి. ఔత్సాహిక క్రీడాకారులు రాణించేందుకు ఇదో చక్కటి ప్లాట్‌ఫాం అని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్ష కార్యదర్శులు శివనాథ్, సతీష్‌బాబు పేర్కొన్నారు. కొందరు ఆటగాళ్లను రూ.10 నుంచి రూ.12 లక్షలు వెచ్చించి మరీ ఫ్రాంచైజీలు దక్కించుకున్నాయని ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగరాజు తెలిపారు. ఏపీఎల్ 4వ సీజన్ ఆగస్టు 8 నుంచి 23వ తేదీ వరకు జరగనుంది.

గరీబ్‌రథ్‌లో బొద్దింకల బెడద

'ఎక్స్'లో రైల్వే మంత్రికి ఫిర్యాదు

తాటిచెట్లపాలెం: గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లో బొద్దింకల బెడదపై రైల్వే మంత్రికి ఓ ప్రయాణికుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ నెల 18న విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు గరీబ్‌రథ్ రైలులో (పీఎన్ఆర్ నంబర్ 6355571224) ప్రయాణించిన ఆ ప్రయాణికుడు.. రైలు బోగీలో బొద్దింకలు తిరుగుతున్న దృశ్యాలను వీడియో తీసి పోస్ట్ చేశారు. 'గరీబ్‌రథ్ అంటే అసలైన అర్థం ఇదేనని నేను తెలుసుకోలేకపోయాను' అని ఆవేదన వ్యక్తం చేశారు.



చోరీలు.. దోపిడీలు.. హత్యలు.. లైంగిక దాడులు.. గంజాయి బ్యాచ్‌ల గ్యాంగ్ వార్‌లు.. మాదక ద్రవ్యాల మత్తులో యువకుల ఘర్షణలు.. ఇలా వరుస ఘటనలతో విశాఖ వణికిపోతోంది. ప్రశాంత నగరంలో రోజూ ఎక్కడో చోట హింసాత్మక సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వంలో రౌడీషీటర్లు, నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. నడిరోడ్డు మీదే కత్తులతో తెగబడుతున్నారు. హత్యలకు పూనుకుంటున్నారు. గంజాయి బ్యాచ్ గ్యాంగ్ వార్‌లతో అలజడి సృష్టిస్తున్నారు. ఫలితంగా సిటీ ఆఫ్ డెస్టినీగా గుర్తింపు పొందిన విశాఖ.. ఇప్పుడు సిటీ ఆఫ్ క్రైమ్‌గా మారిపోతోంది. ఇందుకు ఇటీవల జరిగిన హత్యలు, దాడులు, చోరీ ఘటనలే నిదర్శనం. – విశాఖ సిటీ



ఎటుపోతోంది విశాఖ?

వరుస హత్యలతో వణికిపోతున్న నగరం

- కూటమి పాలనలో క్రైమ్ రాజధానిగా వైజాగ్?
- పెట్రేగిపోతున్న నేరగాళ్లు
- హత్యలు, గ్యాంగ్ వార్‌లతో అలజడులు
- విచ్చలవిడిగా గంజాయి, డ్రగ్స్ దందాలు



హత్యకు గురైన రౌడీషీటర్ లోహిత్(ఫైల్)

ప్రకృతి అందాలతో అలరారే ప్రశాంత విశాఖలో నేడు రక్తపుటేర్లు పారుతున్నాయి. వరుస హత్యలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత రెండు వారాల్లో మూడు హత్యలు జరగడం కలకలం రేపుతోంది. ఈ ఆరు నెలల కాలంలో నగరంలో 12 హత్యలు చోటు చేసుకున్నాయి. వీరిలో ఏడుగురు మహిళలే బలవడం గమనార్హం.

- ఈ నెల 13న అర్ధరాత్రి వెంకటేశ్వరమెట్టకు చెందిన రౌడీషీటర్ చెట్టి ఎల్లాజీ అలియాస్ వట్టి (22) హత్యకు గురయ్యాడు. గొడవలు వద్దు.. సర్దుకుపోండి అన్నందుకు స్నేహితుడే అతడిని కత్తితో పొడిచి హతమార్చాడు.
- ఈ నెల 8న అర్ధరాత్రి పాత కక్షలతో పెందుర్తి పరిధి పులగానిపాలానికి చెందిన రౌడీషీటర్ మాసపు లోహిత్ (20) అలియాస్ నానిని అతడి స్నేహితులే పక్కా ప్లాన్ వేసి చంపేశారు. మాధవధార కుంచుమాంబ అమ్మవారి పండగలో నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే కత్తులతో దాడి చేసి హత్య చేశారు.
- ఈ నెల 6న కొబ్బరితోటకు చెందిన కనకరాజు(32) అనుమానాస్పద మృతి స్థానికంగా కలకలం రేపింది. మద్యం సేవించి కింద పడటంతో తల వెనుక బలమైన గాయం తగలడంతో మరణించినట్లు ప్రాథమికంగా గుర్తించామని పోలీసులు చెబుతుండగా.. ఇది హత్యేనని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.
- ఈ నెల 1న జ్ఞానాపురం శ్మశానవాటికలో అల్లిపురం ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ నాగమణి ఎల్లాజీ(35) హత్యకు గురయ్యాడు. శ్మశాన వాటిక సిబ్బందిని బెదిరించిన ఘటనలో ఒకరు చేతిలో ఉన్న గెడ్డపారతో ఎల్లాజీ తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

మహిళలకు రక్షణ కరువు

ఒక్క రోజులో డెలివరీ కాబోయే భార్యను అత్యంత పాశవికంగా గొంతు నులిమి చంపేసిన భర్త.. డబ్బు కోసం వృద్ధ దంపతులపై కత్తితో దాడి చేసి వివాహిత మెడ కోసి మంగళసూత్రాన్ని ఎత్తుకుపోయిన ఆగంతకుడు.. పెళ్లికి అంగీకరించలేదని ప్రియురాలు, ఆమె తల్లి గొంతు కోసిన ప్రియుడు.. దాకమర్రి ఫార్చ్యూన్ లేఅవుట్‌లో మహిళను హత్య చేసి పెట్రోల్ పోసి తగలబెట్టిన ప్రియుడు.. ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని వారించిన తల్లిని కొట్టి చంపిన కొడుకు.. ఇలా విశాఖలో వరుసగా మహిళలు హత్యకు గురవుతూనే ఉన్నారు. మహిళల రక్షణే తమ ప్రధాన లక్ష్యమని చెప్పుకొచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనితలు విశాఖలో పరిస్థితులపై కనీసం దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై నోరు మెదపడం లేదు. పట్టపగలే మహిళలపై దాడులకు తెగబడుతున్నా.. కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదు. ఈ ఘటనలు విశాఖ ఆర్థిక రాజధానిగా కాకుండా నేర రాజధానిగా మారుతోందన్న వార్తలకు బలాన్నిస్తున్నాయి.

డ్రగ్స్ కలకలం



కూటమి ప్రభుత్వంలో విశాఖ గంజాయికే కాకుండా డ్రగ్స్ కూడా అడ్డాగా మారిపోయింది. అందుకు ఇటీవల జరిగిన కొకైన్ వ్యవహారమే నిదర్శనం. ఢిల్లీ నుంచి కొకైన్‌ను విశాఖకు తీసుకొచ్చిన గ్యాంగ్‌ను పోలీసులు అరెస్టు చేయడం సంచలనం రేపింది. అయితే ఈ డ్రగ్స్ వ్యవహారంలో పలువురి కూటమి నేతల పాత్ర ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన నిందితుడు అక్షయ్ కుమార్‌తో పాటు నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కానీ వీరిలో కేవలం ఇద్దరిని మాత్రమే అరెస్టు చూపించారు. మిగిలిన ఇద్దరిని వదిలేయడం ఇపుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. వీరిని అరెస్టు చేయకుండా కూటమి ప్రజా ప్రతినిధులపై పోలీసులపై తీవ్ర ఒత్తిళ్లు తీసుకువచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం డ్రగ్స్ సరఫరాదారుడు ఢిల్లీలో ఉంటే ప్రిన్స్ అనే కింగ్‌పిన్ కోసం పోలీసుల ప్రత్యేక బృందాలు అక్కడకు వెళ్లాయి. కానీ ఇప్పటి వరకు అతడి ఆచూకీ లభించలేనట్లు తెలుస్తోంది.

గంజాయి బ్యాచ్‌ల గ్యాంగ్‌వార్



గంజాయి బ్యాచ్ దాడిలో గాయపడ్డ జీవన్(ఫైల్)

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గంజాయి బ్యాచ్‌లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గంజాయి నిర్మూలనకు వంద రోజుల ప్రణాళిక పేరుతో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హడావుడి చేశారు. కానీ నగరంలో గంజాయి నిర్మూలన జరగకపోగా.. వినియోగం పెరిగిపోయింది. ఏజెన్సీలో జరిగే గంజాయి సాగుపై గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పంటలను పూర్తిగా ధ్వంసం చేసింది. కానీ కూటమి ప్రభుత్వంలో నగరం నడిబొడ్డులోనే గంజాయి మొక్కలు దర్శనమివ్వడం సంచలనం రేపింది. కొద్ది నెలల కిందట ఆంధ్రా మెడికల్ కాలేజీ వెనుక గంజాయి మొక్కలను గుర్తించగా.. తాజాగా వారం కిందట జ్ఞానాపురంలో ఒక పాడుబడిన ఇంట్లో గంజాయిని సాగు చేస్తున్న విషయం బయటపడింది. ఇలా కూటమి ప్రభుత్వంలో గంజాయి సాగు నగరానికి పాకింది. గంజాయి వినియోగం సైతం విపరీతంగా పెరిగింది. గంజాయి మత్తులో యువకులు నిత్యం దాడులు, దోపిడీలతో అమాయకులపై తెగబడుతూనే ఉన్నారు. ఇటీవల కాలంలో గ్యాంగ్ వార్‌లు విపరీతంగా పెరిగిపోయాయి.

- ఈ నెల 6న అర్ధరాత్రి తమను అవమానకరంగా మాట్లాడి వేధిస్తున్నారన్న కక్షతో ఓ వర్గం.. కొత్తపాలెం ప్రధాన రహదారి గవర రామాలయం వద్ద నలుగురిపై దాడి చేసి గాయపరిచింది.
- ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి రైల్వే గ్రౌండ్ వద్ద రెండు గ్యాంగ్‌లు కొట్లాటకు దిగాయి. రాళ్లతో దాడులు చేసుకున్నాయి. ఇందులో ఇద్దరు గాయపడగా వారికి కేజీహెచ్‌లో చికిత్స అందించారు.
- ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి గాజువాకలో జీవన్ అనే వ్యక్తిపై 11 మంది యువకులు బీరు బాటిళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

తారస్థాయికి కూటమి కక్ష సాధింపులు

- హామీల అమల్లో విఫలమైనందుకే డైవర్షన్ పాలిటిక్స్
- కూటమికి వంత పాడుతున్న ఎల్లో మీడియా
- ధ్వజమెత్తిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



అల్లిపురం: ప్రజలకిచ్చిన హామీల అమల్లో దారుణంగా విఫలమైన కూటమి ప్రభుత్వం.. దాని నుంచి దృష్టి మరల్చేందుకు చేపడుతున్న కక్ష సాధింపు చర్యలు తారస్థాయికి చేరాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం కేసులో తాజా పరిణామాలు, ఎల్లో మీడియాలో వస్తున్న కథనాలే దీనికి నిదర్శనమన్నారు. లేని మద్యం కేసును సృష్టించి వైఎస్సార్ సీపీని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏదో రకంగా ఇరుకున పెట్టాలని చూస్తున్నారు. ఈ ఉద్దేశంతో అమాయకుల్ని కూడా ఇరికించి, ఆ కుటుంబాల ఉసురుపోసుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. 'ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం గడిచిన 13 నెలల కాలంలో అమలు చేయలేకపోయింది. సంపద సృష్టిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఆ పనిచేయలేక విఫలమయ్యారు. ప్రజా క్షేత్రంలో టీడీపీ నేతలు తిరిగే పరిస్థితి లేదు. ప్రజా వ్యతిరేకతను పక్కదోవ పట్టించాలనే ఉద్దేశంతో అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రతి నెపాన్ని వైఎస్సార్ సీపీపై నెట్టే ప్రయత్నం సాగుతోంది. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేశారు.' అని కేకే రాజు ధ్వజమెత్తారు.

ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ

కూటమి ప్రభుత్వం, చంద్రబాబు ప్రజలను మోసం చేసిన తీరును ఎప్పటికప్పుడు ఎండగట్టి.. ప్రజాపక్షాన వైఎస్సార్ సీపీ నిలబడుతోందని కేకే రాజు అన్నారు. ఇది చూసి ఓర్వలేకే రకరకాల పేరుతో లేని స్కామ్‌లను తెరపైకి తీసుకొచ్చి.. వాటిని వైఎస్సార్ సీపీ నాయకులపై రుద్దే కార్యక్రమం జరుగుతోందన్నారు. 'డబుల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పి అసాధ్యమైన హామీలిచ్చారు. రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్లు అప్పు ఉందని అబద్ధపు ప్రచారం చేశారు. అయినప్పటికీ వైఎస్సార్ సీపీకి 40 శాతానికి పైగా ఓటు షేర్ వచ్చింది. మీకు 164 సీట్లు వచ్చినా.. ఎన్నికలు జరిగిన మూడు నెలలకే ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడుస్తున్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా వేలాదిగా జనం వస్తున్నారు. అందుకే వైఎస్సార్ సీపీని నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేకపోయినా ఆయన వెన్నంటి ఉన్న నాయకులను ఇబ్బంది పెడుతున్నారు' అని కేకే రాజు అన్నారు. కూటమి ప్రభుత్వానికి ఎల్లో మీడియా వంతపాడుతోందన్నారు. ఏదో రకంగా ఒక అంశాన్ని తీసుకొచ్చి దాన్ని నిజం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ విధంగానే రాష్ట్రంలో కుట్రలు, కుతంత్రాలు చేయడం కూటమి ప్రభుత్వానికి అలవాటైందని విమర్శించారు.

కూటమి పాలనలో మద్యం ఏరులు..

గత ప్రభుత్వం ఆధ్వర్యంలో వైన్ షాపులు నడిచేవని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశారని కేకే రాజు ఆరోపించారు. ఇప్పటికే వైద్య, విద్యారంగాలను ప్రైవేటుకు అప్పగించారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగాన్ని బలోపేతం చేసి, పెద్ద ఎత్తున మెడికల్ కాలేజీలు కట్టి పేదవాడు డాక్టర్ కావాలన్న కలను నిజం చేయాలని భావించారు. అయితే, ఇవాళ కూటమి ప్రభుత్వం వాటిని కూడా ప్రైవేటుకు ధారాదత్తం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం హయాంలో ఆడపిల్లల మీద జరుగుతున్న అఘాయిత్యాలు, మహిళల మీద దాడులు, రౌడీమూకల అల్లర్లు పెరిగాయన్నారు. ఇందుకు రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం ఏరులై పారడమే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులపై ఎన్ని కుట్రలు చేసినా వాటన్నింటినీ ఛేదిస్తామని, ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల పక్షాన తమ పోరాటం ఆగదని కేకే రాజు స్పష్టం చేశారు.

పేదోడి గుండెకోత

- 'ఉత్తరాంధ్ర గుండె'కు పెద్ద దిక్కు కేజీహెచ్
- ఆరేడు నెలలుగా నిలిచిపోయిన హార్ట్ ఆపరేషన్లు
- మూలకు చేరిన శస్త్రచికిత్స చేసే కీలక పరికరాలు
- నిస్సహాయంగా నిరుపేద రోగులు





మూలకు చేరిన హార్ట్ లంగ్ మిషన్, టెంపరేచర్ కంట్రోల్ మిషన్



గుండె జబ్బుల వార్డులో సాధారణ చికిత్స పొందుతున్న రోగులు

డాబాగార్డెన్స్: గుండె ఆపరేషన్ చేస్తే తన భర్త బతుకుతాడని డాక్టర్లను వేడుకున్న ఆ భార్యకు నిరాశ ఎదురైంది. 'ఇక్కడ ఆపరేషన్లు నిలిచిపోయాయి' అనే జవాబు తప్ప వారికి ఎటువంటి భరోసా లభించలేదు. ఇది ఒక్కరి కథ కాదు. గుండె చికిత్సల కోసం కేజీహెచ్‌కు వచ్చే ఎందరో నిరుపేదల వ్యథ. ఒకప్పుడు వేలాది గుండెలకు ప్రాణం పోసిన కేజీహెచ్ కార్డియాలజీ విభాగానికి నేడు జబ్బు చేసింది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా, అత్యవసర శస్త్రచికిత్స యంత్రాలు మూలకు చేరడంతో పేదల ప్రాణాలు గాల్లో దీపాల్లా మారాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స తీసుకునే స్థోమత లేని నిరుపేదలు ప్రాణాలు వదిలేస్తున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాలైన విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళంతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల పేదలకు గుండె జబ్బులొస్తే ఒకే ఒక్క భరోసా కేజీహెచ్. ఇక్కడ కార్డియాలజీ సూపర్ స్పెషాలిటీ విభాగం ఉంది. నెలకు దాదాపు 40కి పైగా అత్యంత క్లిష్టమైన బైపాస్ సర్జరీలు, వాల్వ్ మార్పిడులు వంటివి చేసి ప్రాణాలు నిలబెట్టిన ఘనత ఈ ఆసుపత్రిది. కానీ గడిచిన ఆరేడు నెలలుగా శస్త్రచికిత్సలు జరగడం లేదు. గుండె ఆపరేషన్లకు కీలకమైన హార్ట్-లంగ్ మిషన్, టెంపరేచర్ కంట్రోల్ మిషన్లు గత 30 ఏళ్లుగా పనిచేస్తున్నాయి. వాటి కాలం చెల్లి, తుప్పుపట్టగా.. ఆరేడు నెలల కిందట వరకు మరమ్మతులు చేయిస్తూ వైద్య సేవలందించారు. కనీసం మరమ్మతు చేయడానికి కూడా అవి పనికి రాని విధంగా తయారవడంతో గత డిసెంబర్ నెలాఖరు నుంచి మూలన పడ్డాయి. దీంతో జనవరి నుంచి తీవ్ర గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారికి శస్త్ర చికిత్సలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ రెండు మిషన్లు మూలకు చేరడంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

కార్పొరేట్ కాసుల వేటలో పేదలు బలి

కేజీహెచ్‌లో ఆపరేషన్లు ఆగిపోవడమే అదనుగా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు కాసుల వేట మొదలుపెట్టాయి. ఆరోగ్యశ్రీ ఉన్నా కూడా ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదనే సాకుతో రూ.5 లక్షల నుంచి రూ.6లక్షల వరకు నిలువుదోపిడీ చేస్తున్నాయి. అప్పు చేసి ఆపరేషన్ చేయించుకోలేని నిరుపేదలు, విధిరాతకు తలొంచి ప్రాణాలు వదులుకుంటున్నారు. కేజీహెచ్‌కి వస్తే రూపాయి ఖర్చు లేకుండా బతికి బయటపడతామనుకున్న వారికి.. లక్షలు పోస్తేనే ప్రాణం నిలుస్తుందన్న నిజం గుండెల్ని పిండేస్తోంది.

పేదల ప్రాణాలంటే చులకనా?

మూలనపడిన ఆ రెండు యంత్రాల ఖరీదు కేవలం రూ. 2.3 కోట్లు ఉంటుందని అంచనా.. ప్రభుత్వానికి ఇది పెద్ద మొత్తం కాదు. కనీసం సీఎస్సార్ నిధుల ద్వారానైనా కొనుగోలు చేద్దామన్న ప్రతిపాదనలు తీసుకొచ్చినా కార్యరూపం దాల్చలేదు. నెలకు రూ.1.50 లక్షల అద్దెకు తెచ్చుకుందామంటే రూ.25 లక్షల డిపాజిట్ కట్టాలన్న నిబంధనకు అధికారులు వెనకడుగు వేస్తున్నారు. అధికారుల లెక్కల్లో ఆ డిపాజిట్ మొత్తం పెద్దదిగా కనిపించిందేమో కానీ, ప్రాణాల ముందు దాని విలువెంత? కోట్ల రూపాయల పరికరాల కంటే పేదల ప్రాణాలు అంత చౌకగా మారాయా? అనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుత వార్డుల్లో రోగులకు సాధారణ చికిత్సలు మాత్రమే అందిస్తున్నారు. అత్యవసరమైతే బయట చూపించుకోవాలని సూచిస్తున్నారు. యంత్రాలు పనిచేయకపోతే వైద్యులు మాత్రం ఏం చేయగలరు? చేష్టలుడిగి చూస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి తక్షణమే ఆ యంత్రాలను సమకూర్చాలని రోగులు కోరుతున్నారు.

ఆగస్టు ఒకటి నుంచి శస్త్రచికిత్సలు

గుండె శస్త్రచికిత్సలకు సంబంధించి పరికరాలు మూలకు చేరిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రజా ప్రతినిధులకు కూడా సమస్యను వివరించాం. వారి నిధుల నుంచైనా ఇస్తారేమోనని.! అలాగే సీఎస్సార్ కింద పరికరాలు సమకూర్చాలని పరిశ్రమలు, దాతలు, బ్యాంకులకు విన్నవించాం. ప్రస్తుతానికి అద్దె ప్రాతిపదికన తీసుకునే అవకాశం ఉంది. ఆగస్టు ఒకటి నుంచి శస్త్ర చికిత్సలు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– ఐ.వాణి, సూపరింటెండెంట్, కేజీహెచ్

నగరంలో ట్రాఫిక్ కష్టాలు

- బీచ్‌రోడ్డులో తలసీమియా రన్‌తో వాహనాల మళ్లింపు
- మళ్లీ జాతీయ రహదారి దిగ్బంధం

విశాఖ సిటీ: విశాఖవాసులను ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతున్నాయి. నిత్యం నగరంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని పరిస్థితులు ఇటీవల కాలంలో తలెత్తుతున్నాయి. బీచ్‌రోడ్డులో ఏ చిన్న కార్యక్రమం నిర్వహించినా ఆ ప్రభావం జాతీయ రహదారిపై పడుతోంది. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసీమియా రన్-వైజాగ్ పేరుతో బీచ్ రోడ్డులో కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతో పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకోడానికి తెలుగుదేశం పార్టీ నేతలు ఈ కార్యక్రమానికి కూడా భారీగా జనసమీకరణకు ప్లాన్ చేశారు. బీచ్‌రోడ్డులో 10, 5, 3 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలను అనుమతించలేదు.



బీచ్‌రోడ్డులో వాహనాల నిషేధంతో వెంకోజీపాలెం వద్ద నిలిచిన ట్రాఫిక్

జాతీయ రహదారిలో అవస్థలు

బీచ్ రోడ్డులో వాహనాలను నిషేధించడంలో అందరూ ప్రత్యామ్నాయ మార్గాలవైపు మళ్లారు. దీంతో మళ్లీ జాతీయ రహదారి వాహనాలతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. మద్దిలపాలెం నుంచి హనుమంతవాక జంక్షన్ వరకు వాహనాలు స్తంభించిపోయాయి. 5 కిలోమీటర్ల జంక్షన్ దాటడానికి గంటన్నరకు పైగా సమయం పట్టింది. ప్రతి సిగ్నల్ వద్ద వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు విసుగెత్తిపోయారు. ఇటీవలే నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం సందర్భంగా మూడు రోజులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గిరి ప్రదక్షిణ సమయంలోను కూడా అదే పరిస్థితి నెలకొంది. తాజాగా తలసీమియా రన్‌కు కూడా ట్రాఫిక్ కష్టాలు ఎదురవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.31.03 కోట్ల పనులకు ఆమోదం



స్థాయీ సంఘ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీకి ఆదాయాన్ని సమకూర్చడంపై దృష్టి సారించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపరచొద్దని మేయర్ పీలా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించి, తద్వారా సంస్థ ఆర్థిక పరిపుష్టికి చర్యలు చేపట్టాలని సూచించారు. బకాయిలపై సమగ్ర నివేదిక రూపొందించి తనకు అందజేయాలని అధికారులను ఆదేశించిన మేయర్.. ఒత్తిళ్లు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. గాజువాక ఆశీలు వసూలు కాంట్రాక్టర్ నుంచి మొత్తం నిధులను వసూలు చేయాలని ఆదేశించారు. 'సాక్షి' దినపత్రికలో వచ్చిన పలు కథనాలపై సంబంధిత అధికారుల వివరణను మేయర్ కోరారు. మేయర్, స్థాయీ సంఘం చైర్మన్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశంలో 60 ప్రధాన అజెండా అంశాలతో పాటు 33 టేబుల్ అజెండాలు చర్చకు వచ్చాయి. అన్ని అంశాలను సభ్యులు ఆమోదించినట్లు మేయర్ తెలిపారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి ఆశీల వసూలు, అద్దెల పొడిగింపు వంటి అంశాలు, ప్రజారోగ్య విభాగంతో పాటు ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన రూ.31.03 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, డీసీఆర్ శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నగర పోలీసులకు 25 కొత్త బైక్‌లు

సమకూర్చిన ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ లిమిటెడ్



నూతన వాహనాలతో పోలీసులు

ఏయూ క్యాంపస్: నగర పోలీసులకు 25 కొత్త మోటార్ సైకిళ్లు సమకూరాయి. ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ లిమిటెడ్(ఏఎంఎన్ఎస్ ఇండియా) కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్సార్) నిధుల నుంచి ఈ 25 మోటార్ సైకిళ్లను అందించింది. శనివారం బీచ్‌రోడ్డులో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వీటిని ప్రారంభించి మాట్లాడారు. విద్య, వైద్యం, పర్యావరణం వంటి వివిధ రంగాలకు ఏఎంఎన్ఎస్ ఇండియా అందిస్తున్న సహకారాన్ని ప్రశంసించారు. పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ పోలీసుల సేవలను మరింత విస్తృతం చేయడానికి ఈ వాహనాలు ఉపయోగపడతాయన్నారు. ఆ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.రవీంద్రనాథ్, హెచ్ఆర్ హెడ్ డి.ఎస్. వర్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ఇద్దరి అరెస్ట్

పెదగంట్యాడ: మండలంలో వైన్ షాపు నుంచి బెల్టు షాపులకు అక్రమంగా తరలిస్తున్న 1,100 మద్యం బాటిళ్లను టాస్క్‌ఫోర్స్, న్యూపోర్టు పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు శనివారం నిఘా పెట్టిన పోలీసులు.. పక్కా సమాచారంతో ఈ ఆపరేషన్ చేపట్టారు. పెదగంట్యాడ నుంచి గంగవరం వెళ్లే రహదారిలో, విశాఖ విమల విద్యాలయం వద్ద ఓ ఆటోలో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లలో 180 ఎంఎల్ పరిమాణంలో ఉన్న 18 కేసుల్లో 860 మద్యం సీసాలు, 650 ఎంఎల్ పరిమాణంలో ఉన్న 20 కేసుల్లో 240 బీరు బాటిళ్లు ఉన్నాయి. ఈ మద్యం బాటిళ్లను తరలిస్తున్న కాకినాడ అప్పలరాజు, వంగలి శ్రీనివాసరావు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. మద్యంతో పాటు ఆటోను కూడా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.1,67,000 ఉంటుందని పోలీసులు తెలిపారు. న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షీలానగర్‌లో చోరీ.. హైదరాబాద్‌లో సుపారీ హత్య

- ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన మలక్‌పేట్ పోలీసులు
- వారి నుంచి కొంత సొత్తు స్వాధీనం
- నిందితులను కస్టడీకి తీసుకునేందుకు గాజువాక పోలీసులు చర్యలు

గాజువాక: హైదరాబాద్‌లోని మలక్‌పేట్‌లో జరిగిన ఒక హత్య కేసు.. ఇక్కడి షీలానగర్‌లోని పెళ్లింట్లో జరిగిన భారీ దొంగతనం కేసులో నిందితులను పట్టించింది. ఈ విషయాన్ని హైదరాబాద్‌లో జరిగిన హత్య కేసును విచారించిన పోలీసు అధికారులు శనివారం నిర్ధారించారు. ఈ మేరకు ఇద్దరు నిందితుల నుంచి ఇక్కడి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. షీలానగర్‌లోని వెంకటేశ్వర కాలనీలో నివాసముంటున్న ఎల్ఐసీ ఉద్యోగి ఇంట్లో ఈనెల 13వ తేదీన భారీ దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. దీనిపై దర్యాప్తు ముమ్మరం చేసిన గాజువాక పోలీసులు అన్ని రకాలుగా విచారించారు. ఈనెల 14న హైదరాబాద్‌లో జరిగిన ఒక సుపారీ హత్య కేసులో ఇక్కడి దొంగతనంలో ఉన్న ఇద్దరు నిందితులు పాల్గొన్నట్టు అక్కడి పోలీసులు స్పష్టం చేశారు. ఆ కేసులో ఏ4గా ఉన్న అర్జున్ జ్ఞానప్రకాష్, ఏ5గా ఉన్న లింగిబేడి రాంబాబు నుంచి షీలానగర్‌లో దొంగిలించిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ హత్య కేసును ఒక సుపారీ గ్యాంగ్ చేసిందని.. అనంతరం అర్జున్, రాంబాబు నెల్లూరు వైపు వెళ్లిపోతుండగా కావలి వద్ద అరెస్టు చేసినట్టు హైదరాబాద్ పోలీసులు తెలిపారు. వారిని విచారించిన సమయంలో షీలానగర్‌లో జరిగిన దొంగతనం కేసు వెలుగుచూసింది. దొంగతనంలో ముగ్గురు వ్యక్తులు పాల్గొన్నట్టు, వారిలో ఒకరు నెల్లూరు జిల్లాకు వెళ్లిపోయినట్టు మిగిలిన ఇద్దరు పోలీసులకు చెప్పారు. దీంతో వారివద్ద ఉన్న చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సొత్తును మూడు సమాన వాటాలు వేసి ముగ్గురూ పంచుకున్నట్టు నిందితులు తెలిపినట్టు సమాచారం. అయితే, దొంగతనం కేసులో నిందితులు రూ.20 లక్షల నగదును కూడా దోచుకెళ్లిపోయిన విషయం తెలిసిందే. మూడో నిందితుడు దొరకని కారణంగా ఆ నగదు వివరాలు తెలియలేదని పోలీసులు చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గాజువాక పోలీసులు హుటాహుటిన హైదరాబాద్ వెళ్లి మలక్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించినట్టు తెలిసింది. ఇక్కడి దొంగతనం గురించి అక్కడి పోలీసులకు వివరించారు. హత్య కేసులో వారిని రిమాండ్‌కు తరలించడంతో ప్రస్తుతానికి గాజువాక పోలీసులు తదుపరి చర్యల కోసం ప్రయత్నిస్తున్నారు. నిందితులను కోర్టు ద్వారా తమ కస్టడీకి తీసుకోవడం కోసం ఆలోచిస్తున్నట్టు తెలిసింది. దీనికి సంబంధించిన ఫార్మాలిటీస్‌ను ప్రారంభించినట్టు పోలీసువర్గాల సమాచారం. కాగా నిందితులంతా పాత నేరస్తులని చెబుతున్నారు. ఒక్కొక్కరిపై పదిహేను కేసులున్నట్టు తెలుస్తోంది.



మలక్‌పేట్ పోలీసులు స్వాధీనం చేసుకున్న షీలానగర్‌లో చోరీ సొత్తు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మరో ఇద్దరికి గాయాలు

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు ఘటనా స్థలాల్లోనే మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ రెండు సంఘటనలకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలివి..

భార్య కళ్ల ముందే భర్త దుర్మరణం



రంజిత్ (ఫైల్)

కూర్మన్నపాలెం ముఖ్య కూడలికి సమీపంలో జాతీయ రహదారిపై స్కూటీని లారీ ఢీకొన్న ప్రమాదంలో మానస రంజిత్ పట్నాయక్ (28) దుర్మరణం పాలయ్యాడు. ఒడిశా రాష్ట్రం, కొరాపుట్ జిల్లా, కుందిలికి చెందిన రంజిత్ పట్నాయక్ తన భార్య రాధికా జ్యోతితో కలిసి శాతవాహననగర్‌లో నివాసముంటున్నాడు. నగరంలోని ఎస్ఎన్ కన్సల్టెన్సీలో పనిచేస్తున్న తన భార్య జ్యోతిని బస్సు ఎక్కించేందుకు స్కూటీపై కూర్మన్నపాలెం బస్టాప్ వద్దకు రంజిత్ తీసుకొస్తున్నాడు. ఆ సమయంలో బస్టాప్ వద్ద అనకాపల్లి నుంచి గాజువాక వైపు వస్తున్న లారీ వారిని ఢీకొంది. దీంతో స్కూటీ నడుపుతున్న రంజిత్ కుడి వైపు పడిపోవడంతో ఆయన మీద నుంచి లారీ దూసుకుపోయింది. ఆయన లారీ చక్రాల కింద నలిగిపోయి నుజ్జునుజ్జు అయిపోయాడు. ఆయన భార్య జ్యోతి ఎడమ వైపు పడటంతో ఆమె కాలికి, తలకు గాయాలయ్యాయి. రంజిత్ రెడ్డీస్ ల్యాబ్‌లో పనిచేస్తుండగా, ఆయనకు వివాహమై నాలుగేళ్లయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి రంజిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలవలస వద్ద బైకుల ఢీ..



రామిరెడ్డి(ఫైల్)

పాలవలస వద్ద జరిగిన ప్రమాదంలో అట్టవానిపాలేనికి చెందిన నక్కా రామిరెడ్డి (45) దుర్మరణం పాలయ్యాడు. హిందుజా సంస్థలో పనిచేస్తున్న రామిరెడ్డి విధులు నిర్వర్తించేందుకు బైక్‌పై ఇంటి నుంచి శనివారం ఉదయం బయలుదేరాడు. పలికిలి దొడ్డి కూడలి వద్ద మలుపు తిరుగుతుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ రామిరెడ్డిని ఢీకొంది. దీంతో కింద పడిపోవడంతో తలకు తీవ్రంగా గాయాలై, ప్రమాదం జరిగిన చోటే రామిరెడ్డి మరణించాడు. అతన్ని ఢీకొన్న అట్టవానిపాలేనికి చెందిన కాకి శ్రీనుకు కూడా గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. రామిరెడ్డికి భార్య మల్లేశ్వరి, కొడుకు చాందిక్ రెడ్డి, కుమార్తె నిహారిక ఉన్నారు. అతని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి సీఐ మల్లేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

ఏయూకు జాతీయ జియోస్పేషియల్ అవార్డు



వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌కు జ్యూరీ అవార్డు అందిస్తున్న ఆచార్య వజీర్ మహమ్మద్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ప్రతిష్టాత్మకమైన 'నేషనల్ జియోస్పేషియల్ అవార్డు 2025 (ఎడిషన్ 2)'లో ఉత్తమ విశ్వవిద్యాలయ జ్యూరీ అవార్డు లభించింది. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ, ఐసీటీ ద్వారా జాతీయ విద్యా మిషన్ కింద ఫాసీ జీఐఎస్ ఈ అవార్డులను ప్రదానం చేసింది. జియోస్పేషియల్ రంగంలో ముఖ్యంగా జీఐఎస్ విద్య, పరిశోధన, కమ్యూనిటీ ఔట్రీచ్‌లలో ఏయూ చేసిన విశిష్టమైన, దీర్ఘకాలిక కృషికి ఈ గుర్తింపు లభించింది. వర్సిటీకి అవార్డు లభించడం పట్ల వీసీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే జియో-ఇంజనీరింగ్, రిమోట్ సెన్సింగ్, టీపీఎస్ కేంద్రం పూర్వ విభాగాధిపతి ప్రొఫెసర్ వజీర్ మహమ్మద్‌కు కూడా నేషనల్ జియోస్పేషియల్ ఫ్యాకల్టీ విభాగంలో జ్యూరీ అవార్డు లభించింది. గత 35 ఏళ్లుగా జియోస్పేషియల్ రంగంలో ఆయన చేసిన ప్రభావవంతమైన కృషికి ఈ అవార్డు లభించిందని సహచరులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డెక్కిన జీవీఎంసీ ఇంజనీరింగ్ కార్మికులు



నిరసన చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భారీ నిరసన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రూ.13 వేలు జీతంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని వాపోయారు. జీవో 36 ప్రకారం అన్‌స్కిల్డ్‌కు 21,000, సెమీస్కిల్డ్‌కు 24,500తో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, డెత్ రిటైర్మెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వీటి సాధనకు ఈ నెల 12వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 62 మున్సిపాలిటీల్లో సమ్మె చేస్తున్నట్లు ఇంజనీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు నూకరాజు పేర్కొన్నారు. జీవీఎంసీ పరిధిలో 2021 మంది ఇంజనీరింగ్ కార్మికులు ఉన్నారని తెలిపారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా డీఏతో కూడిన వేతనం 26,734 అందించాలన్నారు. గతంలో చేసిన సమ్మె ఒప్పందాలను అమలు చేయాలన్నారు. జీవో 25 ప్రకారం పబ్లిక్ హెల్త్ కార్మికులకు చెల్లించిన విధంగా సహజ మరణానికి రూ. 2 లక్షలు, ప్రమాద మరణానికి రూ.5 లక్షలు, అలాగే జీవో 12 ప్రకారం వెయ్యి రూపాయలు చెల్లించాలన్నారు.

ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

తాటిచెట్లపాలెం: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు ప్రజలు, కార్యకర్తలు, కార్పొరేటర్లను నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.వి.రవిరాజు, కార్పొరేటర్లు గుడివాడ వెంకట సాయి అనూష, కేవీఎస్ శశికళ, నాయకులు పేడాడ రమణికుమారి, ఎస్.కృష్ణంరాజు, సతీష్‌వర్మ, కొండారెడ్డి, కొట ఆనందప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎంపీ గొల్ల బాబూరావు

ఎమ్మెల్యే గంటా ముందే నువ్వా? నేనా?

టీడీపీలో మరోమారు బయటపడిన లుకలుకలు

తగరపువలస: భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముందే శనివారం తాటితూరు పంచాయతీకి చెందిన టీడీపీలో రెండు వర్గాలు నువ్వా? నేనా? అన్నట్టు ఘర్షణ పడ్డాయి. దీంతో మరోమారు పార్టీలో లుకలుకలు బయటపడ్డాయి. ఇప్పటికే మండలంలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు జరుగుతుండగా దానికి తెర దించుతున్నట్టు శుక్రవారం ఎమ్మెల్యే గంటా సమక్షంలో పార్టీ మండల అధ్యక్షుడు డీఏఎన్ రాజు ప్రకటించారు. ఇది జరిగి ఒక్కరోజు కూడా పూర్తి కాకముందే తాటితూరులో ఆధిపత్య పోరు కోసం ఇరువర్గాలు తలపడ్డాయి. గతంలో పంచాయతీలో వాయిదా పడిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించడానికి ఎమ్మెల్యే తాటితూరు వచ్చారు. ఆయనకు స్వాగతం పలకడానికి మాజీ సర్పంచ్ పల్లంటి వర్గం, మాజీ ఉప సర్పంచ్ పతివాడ రాంబాబు వర్గం సన్నాహాలు చేసుకున్నాయి. ముందుగా గంటా నేరుగా గోస్తనీ నదిపై జరుగుతున్న చెక్‌డ్యామ్ పనులు పరిశీలించడానికి వెళ్లారు. తరువాత యాతవీధికి రావాలని రాంబాబు వర్గం, నాగవంశీయుల వీధికి రావాలని పల్లంటి వర్గం పట్టుబట్టి ఆయన ముందే పరస్పరం దూషించుకున్నారు. అధికారం కోసం పార్టీలు మారుతారని రాంబాబు వారిని అందరి ముందు తిట్టిపోశారు. పరిస్థితి చేయి జారిపోతుందని భావించిన గంటా శ్రీనివాసరావు కారు ఎక్కి వెళ్లిపోయారు.

ఉత్సాహంగా అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలు

ఫాస్టెస్ట్ గ్రూప్-3 బెస్ట్ స్వామి, పార్ధవి



గ్రూప్-1లో బ్యాక్ స్ట్రోక్‌కు సిద్ధపడుతున్న బాలురు

విశాఖ స్పోర్ట్స్: స్టేట్ అంతర్ జిల్లాల గ్రూప్-3 స్విమ్మింగ్ పోటీల్లో బాలురలో బి.స్వామి, బాలికల్లో పార్ధవి వంద మీటర్ల ఫ్రీస్టయిల్‌లో ఫాస్టెస్ట్ స్విమ్మర్లుగా నిలిచారు. నజ్రీన్, చక్రధర్ పలు స్టయిల్స్‌లో సత్తాచాటి స్వర్ణాలందుకున్నారు. విశాఖ సాగర తీరంలోని అక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం ప్రారంభమైన పోటీల్లో గ్రూప్-1, 2, 3 కేటగిరిల్లో బాలబాలికలకు బటర్‌ఫ్లై, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్, ఫ్రీస్టయిల్ అంశాల్లో పోటీలు జరిగాయి.

- గ్రూప్-3 బాలుర 400 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో కె.దర్శిల్(కాకినాడ) బాలికల్లో ఎం.తన్వీయ(కృష్ణా), 100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్ బాలురలో టి.షణ్ముఖశ్రీ సాయి(వైఎస్సార్ కడప) బాలికల్లో వై.పార్ధవి(కృష్ణా) విజేతలుగా నిలిచారు. వంద మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో బి.స్వామి(ఏలూరు)బాలికల్లో నజ్రీన్(గుంటూరు), 200 మీటర్ల బటర్‌ఫ్లై బాలురలో బి.అభిమన్యు(గుంటూరు), బాలికల్లో నజ్రీన్ విజేతలుగా నిలిచారు. 200 మీటర్ల బాలుర బ్యాక్‌స్ట్రోక్‌లో ఎం.షణ్ముఖ్(కాకినాడ) బాలికల్లో నజ్రీన్ విజేతలుగా నిలిచారు.



50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో విజేత అవిఘ్న

- గ్రూప్-2 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ బాలురలో సాయిసూర్య తేజ(కృష్ణా) విజేతగా నిలిచారు. 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ బాలురలో ప్రణయ్ విజయ్(విశాఖ) బాలికల్లో ఎం.రచన(గుంటూరు), 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రైక్‌లో పృధ్వీరాజ్, వి.లిపి(వీరిద్దరూ ఎన్టీఆర్), 200 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో పృధ్వీరాజ్, యానాజైన్(వీరిద్దరూ ఎన్టీఆర్) 50 మీటర్ల బటర్‌ఫ్లై బాలురలో ధనుష్ సాయి(ఏలూరు), బాలికల్లో యానాజైన్ విజేతలుగా నిలిచారు.
- గ్రూప్-1 1500 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో బాలురలో జి.యశ్వంత్(విశాఖ), బాలుర 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో ఎస్.కార్తికేయ(అనంతపురం), బాలికల్లో బిపికెఎల్ ప్రీతి(విశాఖ) విజేతలుగా నిలిచారు. 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్ బాలురలో గణేష్ చక్రధర్(విశాఖ) పావని శరయు(ఎన్టీఆర్), 200 మీటర్ల ఫ్రీస్టయిల్ బాలురలో కార్తికేయ(అనంతపురం), భవ్యశ్రీ(గుంటూరు) 50 మీటర్ల బటర్‌ఫ్లై బాలురలో పి.అవినాష్(శ్రీకాకుళం), బాలికల్లో అవిఘ్న(బాపట్ల) విజేతలుగా నిలిచారు. 50 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో గణేష్ చక్రధర్(విశాఖ), బాలికల్లో పావని శరయు విజేతలుగా నిలిచారు.
- జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే పివిజిఆర్ నాయుడు పాల్గొని పోటీలను ప్రారంభించారు. అనంతరం చైర్మన్ డిఎస్ఏ ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించి త్వరలోనే పనులు పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలన్నారు. ఈ సందర్భంగా తిరంగా ఫ్యాషన్ వాక్ వైజాగ్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇండియన్ వెయిట్‌లిఫ్టర్ కరణం మల్లేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్ర వ్యాప్తంగా 'ఎన్టీఆర్ ట్రస్ట్ తలసేమియా సెంటర్లు'

ఎంవీపీకాలనీ: ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో తలసేమియా సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లో నిర్వహించిన 'తలసేమియా రన్'ను శనివారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తలసేమియా బాధితులకు అండగా నిలవడానికి ఎన్టీఆర్ ట్రస్ట్ నడుంకట్టిందన్నారు. ఒలింపిక్స్ విజేత, ఢిల్లీ స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ కరణం మల్లేశ్వరి మాట్లాడుతూ తలసేమియాపై వ్యాధిగ్రస్తులు విజయం సాధించడం ఒక అద్భుతమైన అంశమన్నారు. 10కే, 5కే, 3కే రన్‌లో రన్నర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మ్యూజికల్ నైట్ ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ థమన్, ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో, మాజీ ఐపీఎస్ ఆఫీసర్ రాజేంద్ర కుమార్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రన్‌లో పాల్గొన్న యువతీ యువకులు

625 మందికి రూ.39.80 లక్షల ప్రోత్సాహకాలు

బీచ్‌రోడ్డు: ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం నగదు బహుమతులను ప్రదానం చేశారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగిన ఈ కార్యక్రమంలో యూపీఎస్సీ పూర్వ సభ్యుడు, విశ్రాంత ప్రొఫెసర్ కె.ఎస్.చలం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పదో తరగతి, ఇంటర్, ఇంజినీరింగ్, ఏఐఈఈఈ, జేఈఈ, మెడిసన్‌లో ప్రతిభ కనబరచిన బ్యాంక్ సభ్యుల పిల్లలకు ఏటా నగదు బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. కాగా.. 2024-2025 విద్యా సంవత్సరంలో ప్రతిభ చూపిన 625 మంది విద్యార్థులకు మొత్తం రూ.39.80 లక్షల విలువైన నగదు బహుమతులను బ్యాంక్ ప్రకటించింది. ఇందులో భాగంగా నగర పరిధిలోని శాఖలకు సంబంధించిన 250 మందికి రూ.15.95 లక్షల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జోన్-1 ఆర్జేడీ బి.విజయ భాస్కర్, బ్యాంక్ గౌరవ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, డైరెక్టర్లు, బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.వి.బి.వరలక్ష్మి, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.వి.గణేష్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థికి నగదు బహుమతి అందిస్తున్న బ్యాంక్ ప్రతినిధులు